

# అద్దం పగిలింది —

వాడ్రేవు పతంజలి

ముందు ట్రంకుపెట్టె; తర్వాత పరుపు చుట్ట; ఆతరువాత మిఠాయిబుట్ట. పసుపు, కుంకుమమూటలూ అన్నీ బండిలో పెట్టారు.

"లేవండర్రా మరి. బస్సుకి టైము అవుతోంది." అంటూ బయటకు వచ్చారు తాతగారు. పిన్ని, అత్తయ్య, మామయ్య అంతా సావిట్లో దిగాలుగా నుంచున్నారు. అమ్మ మాత్రం ఒకమూల అమ్మమ్మని ఓదారుస్తూంది.

"ఏమిటో దూరమా, భారమా? ఎప్పుడు కావాలంటే అప్పుడు మళ్లా వస్తుంది," అన్నారు తాతగారు. అన్నారేగాని ఆయనకు కూడా కనుకొలుకుల్లోంచి ముత్యాల్లా నీటి బిందువులు తొంగిచూస్తూనే వున్నాయి.

"నూరక్క అసలు అత్తవారింటిలో ఎప్పుడూ వుండే—ఎప్పుడో ఒకసారి చుట్టపు చూపుగా వెడుతుంది. మళ్ళా మనం రమ్మని కబురంపుతే బావ తీసుకువచ్చిదిగబెడతాడు. దానికింత బాధపడటమెందుకూ?" అంటున్నారు మామయ్య.

నాకు కళ్లవెంట నీరు బొటబొట రాలుతున్నది.

"ఓరేయ్—నువ్వెందుకురా ఏడుస్తావూ? జ్ఞానం వచ్చినవాడివి. అమ్మతో వెళ్ళి చదువుకి స్వస్తి చెబుదామనా? ఊరుకో, ఊరుకో" అంది పిన్ని నన్ను బుజ్జగిస్తూ. నాకెంతో సిగ్గేసింది.

అమ్మమ్మ బేల; పిన్ని బేల; అత్తయ్య బేల; అందరూ బేలలే. అయితే ఎవరికివారు తాము మహా గుండెదిటవు అయినవాళ్ళు మన్నట్లు ప్రక్కవారిని ఊరడించ ప్రయత్నిస్తారు. అమ్మమ్మదిమాత్రం తల్లిగుండె.

అమ్మ అంటే తాతగారింట్లో అందరికీ ప్రాణం. ఇంటికి పెద్దఆడబడుచు. నలుగురికీ తలలో నాలుక. చిన్నతనంలోనే కాలికి ఆ ప్రమాదం జరగబట్టి ఇంట్లో ఏ చాకిరీ అమ్మను చేయనిచ్చేవారుకారు. అత్తవారింటి దగ్గరఅయితే అదెలా సాధ్యం? తనబిడ్డ - అసలే అర్భకం—చాకిరీతో మరింత నీరసపడి పోతుందని అమ్మమ్మ దిగులు. ఎన్నాళ్ళనుంచో మాబామ్మ అంటూన్నదని నాన్నగారు అమ్మను పంపవలసిందిగా ఉత్తరం వ్రాశారు. ఆవూరికీ, ఈవూరికీ దూరం ఏభయిమైళ్ళయినా, 'నాతల్లి నాయింట లేకపోయినతర్వాత ఏభయిమైళ్ళలో వుంటేనేమి, ఏడువందల మైళ్ళలో వుంటేనేమి" అని వాపోతుంది అమ్మమ్మ.

ఒక్కొక్కరూ వీథిఅరుగుమీదకు జరిగారు. బండివాడు ఎద్దుదగ్గర కూర్చుని ఎద్దు నోటికి గడ్డిపరకలు అందిస్తున్నాడు. చుట్టుపక్కల అమ్మలక్కలు వీథిఅరుగు లెక్కి చోద్యం చూస్తున్నారు.

"నా వెంకటేశ్వరుడి ఫోటో బండిలో



పెట్టారర్రా?" అని అడిగింది అమ్మ కళ్ళ నీళ్లు వత్తుకుంటూ. పెట్టామన్నారు. మామయ్యా బండిదాకా వెళ్ళి చూసివచ్చాడు.

"నడవం డింక!" తాతగారు మెట్లు దిగుతున్నారు. అమ్మమ్మ అమ్మచెవిలో ఏదో గుసగుసలాడి కొంగున ఏదో మూటగడుతోంది.

"అమ్మమ్మా! బస్సుస్టాండుదాకా నేనూ రావద్దూ?" అన్నాను నేను.

"అలాగే. రా. నువ్వూ ఇందు బండెక్కుదువు గాని" అంటూ అరుగుమీదనుంచి మామయ్యా లోపలికి వచ్చి, నన్ను తీసుకువెళ్ళి బండిలో కూర్చోపెట్టాడు. బండి అబ్బి లపాగా సర్దుకొనివచ్చి, కాడిదగ్గర నిలబడ్డాడు.

"ఒసే సీతా! నువ్వు కాస్త ఎదరికి వెళ్లినుంచో బండి కదిలేటప్పుడు ఎదురు వద్దుగాని," అన్నారు తాతగారు పక్కింటివారి అమ్మాయితో.

"బండి అబ్బి సిద్ధంగా వున్నాడు. నేను బండి ఎక్కాను. మంచి శకునం కూడా ఏర్పాటయింది. అందరూ వీథిలో నుంచున్నారు. అమ్మమాత్రం బయటకు ఊడిపడదేం," అనిపించింది నాకు.

అప్పటికి నాకు పన్నెండేళ్లుంటాయేమో? తర్డుఫారం క్లాబోలు చదువుతున్నాను. అమ్మను విడిచివుండాలనే దిగులు మనసులో పీకుతున్నా, 'మనం మగవాళ్ళం-మనంఏడవకూడదురా' అన్న తాతగారిమాటలూ, 'చదువుకి స్వస్తి చెప్పదామనా?' అన్న పిన్ని మాటలూ, కొంతవరకూ పనిచేశాయి. రాత్రి పడుకోబోయేటప్పుడు ఎన్నో కథలు చెప్పి: "చక్కగా చదువుకుని, నాకూ, నాన్నగారికీ, మన కుటుంబానికీ ఎంతో పేరుప్రతిష్టలు సంపాదించిపెట్టాలి నాయనా!" అనేది అమ్మ. అలాంటప్పుడు "నేనూ పెద్దవాణ్ణయి,

# ★ అద్దం పగిలింది ★

పెద్దపెద్ద చదువులు చదివి. ఇంకా పెద్దఉద్యోగాలుచేసి అందలమెక్కి అందరినీ సుఖపెడతాను," అని నాలో నేను అనుకొనేవాడిని. అంతులేని అభిప్రాయాలుండి, అమ్మ నాన్నగారి దగ్గరకు వెడుతూంటే, నేనూ వెళ్ళి ఆపలెటూళ్ళో దూడలను కాసే వాళ్ళతో గోళీక్కాయలూ, గోటీబిళ్ళా ఆడుతూ చదువుకు స్వస్తి చెప్పడమంటే.. పిన్ని మాటలకు నాకందుకే అంత సిగ్గువేసింది. ఆక్షణంతర్వాత "మనం ధైర్యవంతులం—మనం అమ్మతో వెళ్ళకూడదు. మనం చదువుకోవాలి. మనం ఎంతోగొప్పవాళ్ళంఅవాలి," అనిపించి మరి కళ్ళమ్మట నీళ్లు రనివ్వలేదు.

పెట్టెకు వేసిన రెండు తాళాలూ సరిగా వేశానో, లేదో, పరుపుకట్ట తాడు గట్టిగావున్నదో లేదో పరిశీలించడం ప్రారంభించాను! మిఠాయి బుట్ట ఘుమ్ము' మంటోంది. వీధి చివరవున్న సీత మాటిమాటికీ తొంగిచూస్తోంది. అమ్మ త్వరగా వస్తే బాగుండు ననిపించింది. "కదలండ్రా మరి ఆలస్యమైపోతోంది," అని మళ్ళా తాతగారు హెచ్చరించారు.

అమ్మ, అమ్మమ్మ బండిదగ్గరకు వచ్చారు. అరుగుమీద నుంచున్న వాళ్ళందరూ మెల్లిగా క్రిందకు దిగారు. బండిఅబ్బికాడి నొక్కిపట్టుకున్నాడు. చెయ్యితప్పి తేలిపోయింది.

"ఎక్కమ్మా! వారానికో వుత్తరమైనా వ్రాస్తూండు," అంది అమ్మమ్మ.

"అత్తారింటి కెడుతోందేవిటి సూరక్కా?"

పొరుగింటావిడ మాటలు విని అమ్మ బండి ఎక్కబోయేదల్లా ఆగి, వెనుదిరిగింది.

"అవునండీ. వెళ్ళొస్తా," అంది.

"మంచిదమ్మా. మీవాళ్ళనందరినీ అడిగానని చెప్పు".

కొందరికి మాటలతోనూ, మరికొందరికి కళ్ళతోనూ, వీడ్కోలు చెబుతూ, అమ్మ బండి ఎక్కింది· "నువ్వూ వస్తున్నావేమిట్రా బస్సు స్టాండుదాకాను? ఒరే వీడిచేత కాస్త చదివిస్తూండండి రాత్రిళ్లు." అంది సగం నన్నూ, సగం మామయ్యనూ ఉద్దేశించి అమ్మ. తాతయ్య సీతకు సైగచేశాడు.




## నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది మేహము, ఎక్షాత, విస్పత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును 20 తు డబ్బీ రు 1-4-0 పోస్టేజీరు 1-1-0

వి. ఎ. ఎ అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం, పెరిదేవి (PO) నెల్లూరుజిల్లా.


"పోనీయవోయ్, శకునం బాగుంది." బండి కదులుతోంది. అమ్మ బయటకు తొంగి చూస్తూ "వెళ్లొస్తానమ్మా! వస్తానర్రా! ఉత్తరాలు రాస్తూండండి," అంది.

సీత ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ఎదురువచ్చి, బండి తన్నుదాటాక ఆగి," వుంటాం, సూరక్కపిన్నీ, మళ్ళా ఎప్పుడు వస్తావూ?" అంది. అమ్మ చిరునవ్వు నవ్వింది. బండి సాగిపోయింది.

"అయ్యో, బండిఅబ్బీ! ఒక్కసారి ఆపు. ఒరే క్రితంసారి మీ బావ వదిలేసిన పంచ, లాల్చీ మూటలో కట్టిందేమో. మాణిక్యాన్ని అడుగు-" అని కేక వేసింది అమ్మ.

"పోనీలేవే-ఎవరో ఒకరు వస్తూనే వుంటారు. ఈ సారి పంపిస్తాంలే". అన్నారు తాతగారు.

"మూటలో వున్నాయే అమ్మా. నేను చూశాను" అన్నాను నేను.

"నేను లేనుకదా అని నువ్వు అస్తమానూ ఆటలతోటే తిరక్క బుద్ధిగా చదువుకో తెలిసిందా?" అంది అమ్మ.

"అలాగే నాకో మిఠాయి ఉండ యివ్వవూ"?

"ఇంటికి వెళ్ళాక అమ్మమ్మ పెడుతుందిరా నీకు కావలసినన్ని" అన్నారు తాతగారు. బుట్టవిప్పి, మూడువుండలు బయటకు తీసి, తాతగారికీ, మామయ్యకూ చెరొకటీ ఇచ్చి, నాకొకటి అందివ్వబోయింది.

బండిఅబ్బి పక్కనే కూర్చున్న నేను, పెట్టె ఎక్కి చెయ్యి క్రింద ఆనించి, వుండ అందుకోడానికి రెండో చెయ్యి చాచాను. ఏమిటో 'ఫళుక్కు'మంది.

"ఏమిట్రా అది, ఏదో పగిలింది" అన్నారు తాతగారు ఆత్రంగా. నేను చెయ్యి గభుక్కున తీసేశాను. ఉండ అమ్మవళ్లో పడింది. "అయ్యో, వెంకటేశ్వరుడి ఫోటో అద్దం పగిలిపోయింది. ఒరే, అంత చూసుకోరూ చెళ్ళా!" అమ్మ మనసు చివుక్కుమంది. నేను బిక్కమొహం వేశాను. మామయ్య బండి ముందుకు వచ్చి నన్ను క్రిందకి దింపి నడవమన్నాడు. లోలోపల పొంగివచ్చే ఏడుపును దిగమింగే ప్రయత్నంలో గట్టిగా పెదవులు కరుస్తున్నాను.

బస్సుస్టాండు చేరుకున్నాము. బండి అబ్బి సామానుదింపుతున్నాడు. అమ్మ మెల్లిగా బండిదిగింది. బండికింద వేలాడుతున్న మునిసిపల్ లైసెన్సు బిళ్లకు కొంగు తగులుకుని అడుగు మేర అమ్మ కట్టుకున్న ఆకాశపురంగు బండార్లంక కొత్త జరీచీర అంచు చిరిగిపోయింది. తాతయ్య మనసు అపస్వరం పలికింది.

అరగంట తర్వాత బయలుదేరే బస్సులో టిక్కట్లు దొరికాయి "ఒరేయ్, రేవులో తిప్ప బాగావుంటే బండి కట్టించు మర్చిపోక," అని జ్ఞప్తి చేశారు మామయ్యకు తాతగారు—మబ్బులు ముసురుకొని వస్తున్న ఆకాశంవైపు చూస్తూ.

బస్సు కదిలింది.

"వెళ్ళొస్తాం. ఉత్తరాలు రాస్తూండు ఒరే బుద్ధిగా చదువుకో—అన్నట్టు బండిలో పడిన ఉండ తీసుకున్నావా." తలపైకి పెట్టి అరిచింది అమ్మ. "వాడికి అమ్మమ్మ ఇస్తుందిలే." తాతయ్య గట్టిగా అరిచాడు. బస్సు మమ్మల్ని దాటిపోయింది. చిన్న చినుకులు రాలుతూంటే రోడ్డువార నున్న కాఫీ హోటలు అరుగుమీదికి దారితీశారు తాతగారు.

* * *

రాత్రి భోజనంఅయ్యాక పెద్ద మంచం ఎక్కి బోర్లా పడుకుని ఆ వాళ్టి సంఘటనలను గూర్చి ఆలోచిస్తున్నాను. వెంకటేశ్వరుల వారి ఫోటో అంటే అమ్మకు ఎంతో యిష్టం. చూసుకోకుండా అద్దం బ్రద్దలు కొట్టి, అమ్మ మనసు కష్టపెట్టాను. నాకు దుఃఖం పొంగివచ్చింది.

"అదికాదే, ఎదురొచ్చిన సీత తిన్నగా యింటికి రాక సూరక్కని పలకరించడమూ, బండి ఎక్కబోతున్న సూరక్క పక్కింటావిడ పలకరించిందని—వెనక్కి తగ్గడమూ, నాకు ఏవిటో అపశకునంలా కనిపించాయి." అంటున్నారు తాతగారు భోజనం చేస్తూ.

"ఏమిటో మన పిచ్చిగాని మావయ్యా, ఇలాంటివాటివల్ల ఏవీ అశుభం జరగదు" తాతయ్యగార్ని వారించబోయింది అత్తయ్య.

"దానికెంతో ఇష్టమైన వెంకటేశ్వరుల వారి ఫోటోఅద్దం పగలడం, కట్టుకున్న కొత్తచీర చిరగడం, కారు బయలుదేరబోయేముందు వాన రావడం-ఇవన్నీ ..." అంటూ తగ్గిపోయి—

"ఒసేయ్ చూడూ. వాడు మంచంమీద పడుకుని ఏడుస్తున్నట్టున్నాడు. ఇలా తీసుకురా వాణ్ణి" అన్నాడు తాతగారు నా మూలుగు విని.

లేవనుగాక లేవనంటే నన్ను అలాగే వదిలేసి అమ్మమ్మ కళ్లనీళ్లు కక్కుకుంటూ వెళ్లిపోయింది.

ఇంట్లో ఎవరికీ ఏమీ తోచడం లేదు. అమ్మమ్మ ఫలహారం చేయనంటే బలవంతాన తినిపించారు.

* * *

మర్నాటి సాయంకాలానికి మామయ్య తిరిగి రానేవచ్చాడు. అంతా ఆత్రంగా చుట్టూమూగి ఏమేమో అడిగారు. అమ్మ

(28-వ పేజీ చూడండి)

# ★ అవిముక్తుడు ★

(23 వ పేజీ తరువాయి)

కన్నకొడుకుతో ఏమీ అనలేకపోయి, అచలనంగా వుండిపోయింది.

శ్రీనివాసరావు తనగదిలో మతిపోయిన వానిలా అయిపోయాడు.

అతనిమనసులో అనేక ఆలోచనలు సంఘర్షణ ప్రారంభించాయి.

తనునిజంగాస్వార్థపరుడేనా? లోకంలో యితరులకు అనేక ఉపకారాలు చేసే వ్యక్తులంతా స్వార్థపరులేనా? స్వార్థం లేకుండా ఎవరూఏపనులూ చేయనే చేయరా? నిజమా?

నేను యిన్నేళ్లు అనంతానికి చేసిన సహాయమంతా ఏమిటి? నేనేం ప్రతిఫలం కోరేను?

అయినా అనంతం—అమాయకుడూ, విధేయుడూ, మితభాషి అయిన అనంతం-నాపోషణలో నాయింట్లో ఏ వేదన అనుభవించేడు?

మరెందుకిలా వాపోతున్నాడిప్పుడు? నేను యీ అనంతానికి విద్యాదానం చేసి సంబరపడడం తప్పా? అనంతం జీవితాంతము నాకు వినమ్రుడు, అనుకూలుడు అయి వుండటంలో దోషం ఎందుకుంటుంది?

బి. ఏ చదివించి. వుద్యోగం వేయించి అభివృద్ధికి తెచ్చానే! ఇంకా మిగిలివున్న కాస్త సదుపాయమూ వివాహం కూడా జరిపించి అతణ్ని జీవితంలో కృతార్థుని చేయాలనుకుంటున్నా. ఇదేం తప్పు? నిజంగా స్వార్థపరుణ్నే అవుతే అంతా నన్నుగురించి మంచిగా ఎందుకు చెప్పుకుంటారు?”

శ్రీనివాసరావు మెదడులో చాలా ఆలోచనలు వచ్చాయి. తను ఎప్పుడూ స్వార్థపరుడు కాడని, ఉదారుడిననీ అతని నమ్మకం.

అంచేత తన్నుగురించి ఎట్టి సందేహము, అపోహ వుంచుకోక నిశ్చింతుడయ్యాడు.

అనంతం ఎలా వెళ్ళిపోతాడు? ఎక్కడికి వెళ్లిపోతాడు? ఎందుకు వెళ్లిపోతాడు? తన త్యాగాన్ని కాదని, తనమాటను కాలదన్నగలిగేవాడేనా అనంతం అనుకుంటూ నిద్రపోయాడు శ్రీనివాసరావు.

ఉదయం కాఫీ త్రాగింతర్వాత అనంతాన్ని పిల్చాడు శ్రీనివాసరావు.

అనంతం ప్రయాణ సన్నాహంలో వున్నాడు. శ్రీనివాసరావు లేచినసుంచీ అది పసికట్టే వున్నాడు.

అనంతం రాగానే శ్రీనివాసరావు తన సహజ ఔదార్యాన్ని చూపుతూ అన్నాడు.

“ఇదుగో అమ్మచెప్పిన విషయం నువ్వు ఆలోచించే వుంటావ్. నీ శ్రేయస్సుకోరుతూ యిప్పటివరకు చేస్తూవచ్చిన అన్నిటివలె ఈ సహాయాన్ని కూడా నీవు అందుకోక తప్పదు. నీకేం నేను ముప్పు తీసుకురాలేదు. పోని నీ సహచరుల్ని సంప్రదించు. యుక్తవయస్కుడవు— అమ్మ నీ వివాహంగురించి ఉబలాటపడుతూన్నది. నాచేతులమీదనే యీ శుభకార్యము జరపాలని నా కోరిక. ఇవాళ మంచిది. పిల్లను చూడడానికి వాళ్ళ వూరు వెళ్లాలి. ఇప్పుడే తొమ్మిదింటి బస్సులో బయల్దేరుదాం.”

అనంతం ఎన్నో అనేయాలని మహా ఆత్రుతపడ్డాడు. కానీ ఒక్కమాటా అనలేక పోయాడు.

శ్రీనివాసరావుతో ప్రయాణమయ్యాడు.

* * *

అనంతం భార్యతోనూ. తల్లితోనూ శ్రీనివాసరావుగారి ఔదార్యంలో, వారింట ఒకగదీ-వంటిల్లు వాడుకుంటూ జీవితం సాగిస్తున్నాడు.

అనంతం శ్రీనివాసరావుగారింట ప్రవేశించిన ప్రారంభంలో అలవాటుపడిన కార్యకలాపాలలో వేటినీ విస్మరించక విధ్యుక్తంగా నిర్వర్తించుకుపోతున్నాడు.

శ్రీనివాసరావు తాను అనంతం సమస్తాభివృద్ధికి కారకుడినయ్యానని పొంగుతు లావెక్కసాగేడు.

అనంతం శ్రీనివాసరావుగారి సానుభూతి, సహకారాల్లో శల్యావశిష్టుడు కాసాగేడు.

శ్రీనివాసరావు ఉదారగుణం పలువురు మెచ్చుకుంటూ, “అనంతం ఎంత అదృష్టవంతుడు!” అనుకుంటారు. ★

# అద్దం పగిలింది

(26వ పేజీ తరువాయి)


కులాసాగా వుందట. వంటా, ఇతరపనులూ చేయడానికి పనిమనుషుల్ని పెట్టుకున్నారట. అమ్మమ్మకి ఈ కబురు వినేసరికి కొండంతభారం తీసినట్టయింది.

* * *

నెల తిరక్కుండానే నాన్నకి మళ్లా కబురు మామయ్యకొడుక్కి పుట్టువెంట్రుకలు తీస్తారట. అమ్మ, నాన్న ఓ నాటి సాయంకాలం కనుచీకటిపడేవేళ గుమ్మంలో బండిదిగారు. నేను అమాంతం వెళ్లి అమ్మను కావలించుకున్నాను. ఇంటిల్లిపాదికే అమ్మ ఏమిటో ఎక్కడనుంచో దిగివచ్చినట్టనిపించింది.

* * *

నాకుమాత్రం ఇప్పటికీ అద్దం పగలడం చూసినా, చప్పుడువిన్నా, ఆ నాటి సంఘటన జ్ఞాపకంవచ్చి, ‘అప్పుడైతే అమ్మ తిరిగివచ్చింది; ఇప్పుడెక్కడనుంచి వస్తుంది,’ అనిపించి మనసును కలచివేస్తుంది. ★

బాగా ఆడా! ఒకే ఒకసారి తోముకుంటే
కాల్గేట్ డెంటల్ క్రీమ్
85% వంతుల వరకు
దంతక్షయం దుర్గంధం కలిగించే క్రిములను తొలిగిస్తుంది!


సత్ఫలితాలకు సర్వదా వాడండి
కాల్గేట్ టూత్ బ్రష్
DCG/24R8